# సై ఆట

ఒకప్పుడు తెలుగు సినిమాల్లో గాయనీ గాయకుల సంఖ్య పరిమితంగా ఉండేది. సినీరంగంలో నిలదొక్కుకున్నవారు కొత్తవారిని పైకి రానివ్వరన్న అపవాదు కూడా ఉండేది. కానీ ఇటీవల ఆ పరిస్థితి మారింది. ప్రతి చిత్రంలోనూ కొత్త గొంతు వినిపిస్తోందంటే అతిశయోక్తి కాదేమో!

పూర్వం గాయనీ గాయకులందరి పేర్లూ అందరికీ తెలిసేవి. గొంతు విని వారిని సులభంగా గుర్తు పట్టేవారు సినీ సంగీతాభిమానులు. కానీ ఇప్పటివారు చాలా చిత్రాల్లో పాడినా అభిమానులకు అపరిచితులుగానే ఉండిపోతున్నారు. అటువంటివారిని ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు ఈటీవీ ప్రారంభించిన మ్యూజికల్ గేమ్ షో **సై ఆట**.

ఈ సంవత్సరం ప్రారంభమై ప్రతి మంగళవారం రాత్రి 9.30నుంచి ఓ గంటసేపు కొనసాగే న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది- ప్రముఖ గాయకుడు మనో. ఆయనకు సహకారంగా అందాల నవీన. ఆ వారానికి ఎంపిక చేసిన ఇద్దరు గాయకులు, ఇద్దరు గాయనులు పోటీలో పాల్గొంటారు. విభిన్నమైన నాలుగు రౌండ్ల అనంతరం విజేతను ఎన్నుకుని పాతికవేల రూపాయల నగదు బహుమతితో సత్కరిస్తారు.

సంగీతప్రియులకు పూర్తి సంతృప్తినిచ్చేలా రూపొందించబడిన ఈ కార్యక్రమంలో అందరికీ ఆసక్తిని కలిగించే రౌండ్- **యురేకా తికమక**. గతంలో విజయ్‌పథ్ (హిందీ చిత్రం) లోని 'రుక్ రుక్ రుక్ అరె బాబా రుక్' అనే హుషారు పాటని- 'భామనే సత్యభామనే' తెలుగు చిత్రంలో భక్తిపాటల వరుసలో పాడించి వినోదం సృష్టించిన తీరు ఈ రౌండ్‌కి ప్రేరణ. గాయనీగాయకుల సృజనాత్మకతకు పరీక్ష అనతగ్గ ఈ రౌండ్‌లో ఇంతవరకూ ఎందరో గాయనీగాయకులు అసమాన ప్రతిభను చూపించారు.

మిగతా రౌండ్స్ మరీ అంత ఆకర్షణీయంగా అనిపించకపోవడానికి యాంకరింగు లోపం కూడా కొంత కారణమనవచ్చు. బహుముఖ ప్రజ్ఞాశాలి మనో- ఒక కామెడీ నటుడిలా కాక హుందాగా వ్యవహరించాలనిపిస్తుంది. యాంకర్ నవీన అందం సహజమనిపించినా ఆమె మాటల్లో, చేతల్లో కృత్రిమత్వం గోచరిస్తోంది.

ఏదెమైనా వర్తమానంలో సుమారుగా ఉన్న ఈ ప్రయోజనాత్మక వినోద సంగీత కార్యక్రమానికి మంచి భవిష్యత్తు ఉందనే అనిపిస్తుంది.